# అమ్మాజీ

శ్రీ కె. ఎం. దేవర్

"అమ్మాయి—తలుపువెయ్యవే"

..................

"నిన్నే తలుపువెయ్యి. ఎవరన్నా వస్తారు."

..................

"లేమొద్దు. నవ్వుతావేం. తలుపేయమంటే" అని తానే వోరగావచ్చి తలుపువేయును.

వాళ్లమ్మ స్నానంచేస్తూంటే తలుపు తెఱచి అడ్డంగానుంచుంది. తలుపెయ్యమంటే వెయ్యదు. నవ్వుతది. మరి ఆ చిన్నపిల్లకుచూడండిసరసం. వాళ్లమ్మ తలుపువేయగానే

"నేవెళ్తా" అని మళ్లీ తలుపుతెఱచి—అడ్డం... శారదకు పట్టరానికోపమొచ్చింది. కాని ఏంచేస్తది. ప్రక్కగావచ్చి తలుపువేసి, కూతురికి రెండు చెంప దెబ్బలువేసివెళ్లింది. మరి ఊరుకుంటదా? ఆ చిన్నపిల్ల దొంగయేడుపులేడుస్తూంది తలుపుతియ్యమని.

"అమ్మాజీ" అన్న కేక వినపడేసరికి ఏడు పెక్కడికెళ్లిందో! గడతీసి పరుగెత్తింది.

ఇవిగో నీకు బిళ్లలు—అని ఒకపొట్లాం అందిచ్చాడు చలపతిరావు. అమ్మాజీ అవి చప్పరిస్తూవచ్చి దానిమాటల్తో అన్నది.

నాన్నా...నాన్నా .....అమ్మే...ఎవరో... వస్తా...తలుపు... నేనే యేడ్చా — అంది — చలపతి రావుకి, సరిగా అర్థంకాలా—మళ్లీచెప్పింది ఆమాటల్తోనే—

అసలు కాపురానికొచ్చిందగ్గరనుంచి అనుమానమే చలపతికి. కాని విఫలుడైయ్యేవాడు. ఇప్పుడీమాటలు అర్థంకాలా. ఇలా చెబుతుందే. ఎవరొచ్చారు. ఒకటికి రెండుసార్లు చెపుతుంది...ఏమో నేలేనప్పుడు...ఎవరికేంతెలుసు...అయినా అడుగుదామనుకున్నాడు.

ఇంతలోకే

"భోజనం చెయ్యరూ"

ఉలిక్కిపడి వెనక్కు తిరిగిచూచాడు. పాప మాతనికప్పుడు అమాయకురాలిగా కన్పడ్డది. ఆ ముసిముసినవ్వులు మరింత హెచ్చించాయి. అడుగుదామా వద్దా అనుకున్నాడు. అప్రయత్నంగా

గ్రంథం జరిపావటే—అనేశాడు.

విమలకు అది క్రొత్తగాదు ఇట్లాటిమాటలు వింటం. ఆ నవ్వుపోయింది.

"ఏమండీ...ఏంచేసాను మీమాటలు నాకర్థంగావటంలా" అంది పాపం ఆ అమాయకురాలు.

"సాకు భోజనమక్కరలా—పోగదిలోనుంచి ఏంచాశావో తెలీదు. నీ ముఖంచూస్తే తెలీటల్లా" అన్నాడు కోపంగా.

అనుభవమున్నది కాబట్టి తానక్కడ ఉంటే కోపం మరీ ఎక్కువచేయడం అవుతుందని అవతలికెళ్లింది.

చలపతికి అనేకఆలోచన్లు తట్టాయి. చివరకు చేసేఉంటుందనుకున్నాడు. ఇదివరకులాగా ఇది విఫలం కాదనుకున్నాడు. ఎవరొస్తారు చెప్మా ఆచారే వస్తూవుంటాడు రోజు...అవును వాడే అయ్యిఉంటాడు. చిన్నపిల్ల అభద్దంచెప్తదా అనుకున్నాడు. మామగారికి ఉత్తరం వ్రాద్దామనుకున్నాడు. నేను క్యాంపు కెళ్తూన్నా గాబట్టి ఇంట్లో ఎవరూ ఉండరు..అయిన దీపావళి దగ్గరకొస్తున్నదిగాబట్టి కూతుర్ని అక్కడుంచుకోవచ్చును. అని వ్రాశాడు. ఈ ఆలోచన్లతో నిద్రాదేవికి వశమయ్యాడు.

*

సాయంత్రం ఆరుగంటలవుతుంది.

"ఏమండోయి" అన్న కేక వినపడింది లేచాడు వళ్లు వించుకుంటూ

"కాఫీఅన్న త్రాగరూ. భోజనం చెయ్యలేదు ప్రొద్దున్నించి" అన్నది.

మళ్లీ ఒక్కసారి దీనంగాచూసాడు ముఖంలోకి. కళంకం లేనట్టుగా ఉంది.

“శారద! ఎవరొచ్చారు ప్రొద్దున మనింటికి” అన్నాడు దీర్ఘ విశ్వాసవిడుస్తూ.

“ఎవ్వరూ రాలేదే”

“నిజంచెప్పు. చిన్నపిల్లమాటలబద్దాలా.”

“ఎవరు. అమ్మాజీచెప్పిందా. ఉండండి అడుగుదాం” అని గబగబవెళ్ళియెత్తుకొచ్చింది.

“అమ్మాజీ! అమ్మ ప్రొద్దున్న ఏం చేసిందిరా” అన్నాడు. మళ్లా అలాగే చెప్పింది. అదివిని విమల ఒకటేనవ్వటం మొదలెట్టింది.

“నవ్వుతావేం దానికి జవాబుచెప్పు” అన్నాడు.

“దీనికే ఇంత అనుమానంఅయితే ఎలాగండీ. అది చెప్పేది గ్రహించుకోలేక నామీద కోపంచేస్తారేం. ప్రొద్దున్నే స్నానం చేస్తూంటే, ఎవరన్నావస్తారు తలుపెయ్యమంటే, వెయ్యకుండా అడ్డంగానుంచుని నవ్వుతూంది. అందుకని నే తలుపేసి రెండుతగిలిచ్చాను. దానికి ఏడ్చానని చెప్తుంది” అని అమ్మాజీని క్రిందకు దించింది.

అవును అన్నట్లుగా పరిగెత్తింది తండ్రివద్దకు.

తన తెలివికి తానే సంతోషించుకొని బల్లమీద ఉత్తరం చించేసి, లోపల నవ్వుకుంటూ “శారదా చూశావు అమ్మాజీ ఏంచేసిందో” అని బుగ్గగిల్లాడు.

“అమ్మాజీ కాదు. మీ తెలివే” అని తన రెండు చేతులు అతనిభుజంమీదవేసింది.

పాపం వాళ్లకేం తెలుసు అమ్మాజీ నవ్వుతూందని.


కావాలి

ఫిల్ము వ్యాసాలు కథాంజలికి కావాలి. ఆ వ్యాసాలు అర పేజీకి మించకుండా వుండాలి.


# గ్రంథ సమీక్ష

## నాడు — నేడు

జారుచక్రవర్తుల పరిపాలనా కాలంనుంచీ, యుద్ధ కాలం, అంతర్యుద్ధ కాలం, సోవియట్ పరిపాలనా కాలం వరకూ ఒక కార్మికకుటుంబంయొక్క అవస్థల్ని గ్రంథ కారుడు వర్ణించేడు. పెట్టుబడిదారీవిధానంలో కార్మికులఅవస్థలు, వాళ్లలో వ్యాపించేదురభ్యాసాలు, వాళ్లని నాశనంచేస్తూంటాయి. తమస్థితిని గ్రహించిన కార్మికులు ఎంతపట్టుదలతో తమవర్గపోరాటాల్ని కొనసాగిస్తారో, తమఆదర్శాన్ని సోవియట్ కార్మికులు ఎంత తీవ్రంగా ఆరాధిస్తారో, దానికై వా రెంత త్యాగాన్ని చేయగలరో కళ్లకుకట్టినట్లు తెలిపే చక్కని సోవియట్ నవలారాజము క్రౌన్ 450 పుటలు చక్కనిబైండుతో వెల 1-4-0.

## రాజ్యాంగ యంత్రం

లెలిన్ ఉపన్యాసమునకు తెనుగు. రాజ్యాంగ యంత్రం అంటే ఏమిటి? అది అధికారంలో వుండేవర్గం యొక్క పీడనాసాధనమని బుజువుచేస్తాడు, లెనిన్ చక్కని యుక్తిప్రయుక్తులతో, ఈ చిన్న కరపత్రం. రాజకీయవిద్యార్థులు ముఖ్యంగా చదివితీరాలి. క్రౌన్ 48 పుటలు వెల 0-2-0.

## విప్లవసందేశం

ప్రిన్స్ క్రోపాట్కిన్ ప్రపంచయువకులకు, వారికర్తవ్యాల్నిగురించి ఒక ప్రకటన చేసేడు. అది ప్రపంచంలోని అన్నిభాషల్లోకీ అనువదించబడింది. హృదయంవున్న ఏ మానవునైనా కదిలించివేయగల ఆవేగం గల శైలీభావాలూ. అనువాదకులు మంచి సమర్థతో, హృదయావేగంతో స్వతంత్ర అనువాదం చేసేరు: యువతీయువకులు చదివితీరాలి. క్రోపాట్కిన్ విప్లవజీవితంకూడ పొందుపరచబడియుంది. క్రౌన్ 60 పుటలు వెల 0-2-0 మాత్రమే. ఈ పై మూడు గ్రంథాలు కూడా విశ్వసాహిత్యమాల, ముంగండవారివే.